

ఆలయాలకు మహర్దశ
ఉమ్మడి జిల్లాలోని ఆలయాలకు మహర్దశ రానుంది. దూప దీప నైవేద్యం కింద మరో 638 ఆలయాలు ఎంపికయ్యాయి.
8లో▸



ట్రిపుల్ ఐటీ సమస్యలు పట్టవా..?
బాసర ట్రిపుల్ఐటీ సమస్యలను పట్టించుకోవడం లేదని బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి ఆరోపించారు.
10లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 41.0 /30.0
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. నైరుతి దిశగా వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీ ప్రైవేట్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న ఉపేందర్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్టీసీలో సంస్థలో పనిచేస్తున్న ప్రైవేట్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో ప్రైవేట్ డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో సీఎం ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ ప్రైవేట్ డ్రైవర్లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సంస్థలో దాదాపు నాలుగు వేల మంది పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కనీస వేతనంగా రూ.32వేలు చెల్లించాలని, వేధింపులు అరికట్టి పనిభారం తగ్గించాలని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలేశ్‌కుమార్, నాయకులు తాజ్ మియా, సాయికృష్ణ, గణేశ్, సోమా, విజయ్, రాజశేఖర్, కిరణ్, మల్లేశ్, శ్యాం, ప్రకాశ్ పాల్గొన్నారు.

టీఎల్ఎం మేళా విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యా దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో నిర్వహించే ఎఫ్ఎల్ఎన్(ఫౌండేషనల్ లిట్రసీ, న్యూమరసీ) టీఎల్ఎం మేళాను విజయవంతం చేయాలని విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి మేళాలో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి, తెలుగు, గణితం, ఆంగ్లం, ఉర్దూ విభాగంలో బహుమతులు పొందిన వారు జిల్లాస్థాయి మేళాకు హాజరుకావాలని సూచించారు. ప్రతిభ చూపిన వారు రాష్ట్రస్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

'సీఎం పర్యటన అడ్డుకుంటాం'

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటనను అడ్డుకుంటామని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యెలగతి సుచిత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏం అభివృద్ధి చేశారని ఈ నెల 24న జిల్లా పర్యటనకు వస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రిని అడ్డుకుని బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతామని పేర్కొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



వంటలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు హాజరు పెంచేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తరగతి గదులు, వంటశాల, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు.

కళాశాలల్లో ఘనంగా హరితోత్సవం



మొక్క నాటుతున్న డీఐఈవో శ్రీధర్ సుమన్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో సోమవారం హరితోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీఐఈవో శ్రీధర్‌సుమన్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం పుణ్య కార్యమన్నారు. మొక్కలు సంరక్షించడం ద్వారా రానున్న తరానికి ఆక్సిజన్ అందించిన వారమవుతామన్నారు. హరితోత్సవం విజయవంతం చేసిన అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.

కొత్త రైతులకు నిరాశ!



రెబ్బెన మండలం గంగాపూర్‌కు చెందిన ధనలక్ష్మి గత ఫిబ్రవరిలో కొత్తగా వ్యవసాయ భూమిని కొనుగోలు చేసింది. పదిహేను రోజుల్లో కొత్త పాస్‌పుస్తకం కూడా వచ్చింది. ప్రభుత్వం కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన వారు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో పట్టా పాస్‌పుస్తకం, అధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పత్రాలతో వ్యవసాయశాఖ అధికారులకు దరఖాస్తు ఇచ్చింది. అయితే రైతుబంధు పోర్టల్‌లో ఇంకా మీ పేరు రాలేదని చెప్పి పంపించారు. ఇది ఒక్క ధనలక్ష్మి సమస్యే కాదు.. జిల్లాలో కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన చాలా మంది రైతులకు ఇదే సమస్య ఎదురవుతోంది.

- కొత్తగా పట్టా పాసుపుస్తకాలు పొందిన వారి విషయంలో అయోమయం
- రైతుబంధు పోర్టల్‌లో కనిపించని పేర్లు
- జనవరి తర్వాత జిల్లాలో వేలాది మందికి నూతన పట్టాలు

రెబ్బెన(ఆసిఫాబాద్): పంటల సాగులో రైతులు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రైతుబంధు రూపంలో ఆర్థిక చేయూతనందిస్తోంది. వానాకాలం, యాసంగి రెండు సీజన్లలో ఎకరానికి రూ.5వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తూ అన్నదాతలకు బాసటగా నిలుస్తోంది. మరికొన్ని రోజుల్లో వానాకాలం సీజన్‌కు సంబంధించి పెట్టుబడి సాయాన్ని బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. అయితే కొత్తగా భూములు కొనుగోలు చేసిన రైతులు, వారసత్వం, దానంగా భూమిని పొంది కొత్త పట్టాపాస్ పుస్తకం పొందిన వారు వానాకాలం సీజన్‌లో రైతుబంధుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సీజన్‌కు ముందు కొత్త పట్టా పాస్‌పుస్తకాలు పొందిన రైతుల నుంచి రైతుబంధు కోసం దరఖాస్తులు స్వీకరిస్తుంది. ఈ సంవత్సరంలో కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతుల వివరాలు రైతుబంధు పోర్టల్‌లో కనిపించకపోవడంతో సమస్య తలెత్తుతోంది.

వడ్డీ వ్యాపారులే దిక్కు

పంటల సాగుకు పెట్టుబడి ఏటా గణనీయంగా పెరుగుతోంది. విత్తనాల ధరలు, ఎరువులు, కూలీల ఖర్చులు, యంత్ర పరికరాల ధరలు రైతులను కలవర పెడుతున్నాయి. అయినా రైతులు వ్యవసాయాన్ని నమ్ముకుని కోటి ఆశలతో సాగు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు అందిస్తుండటంతో రైతులకు ఆర్థికంగా కాస్త వెసులుబాటు లభిస్తోంది. కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన వారికి పెట్టుబడి సాయం పొందేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే భూములు దుక్కిదున్ని తొలకరి వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. వర్షాలు మొదలైతే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక చాలా అవస్థలు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంకుల నుంచి సైతం రుణాలు అంతంతే అందుతుండటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వానాకాలం సీజన్‌లో కొత్త రైతులకు కూడా రైతుబంధు అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

డిసెంబర్ వరకు మాత్రమే అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం సూచనతో కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు 'రైతుబంధు'కు అవసరమైన పత్రాలతో దరఖాస్తులను వ్యవసాయ శాఖ అధికారులకు అందజేస్తున్నారు. ప్రభుత్వం గత డిసెంబర్ వరకు కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతులకు సంబంధించిన వివరాలనే రైతుబంధు పోర్టల్‌లో పొందుపర్చింది. ఆ తరువాత పాస్‌పుస్తకాలు పొందిన వారి వివరాలు పోర్టల్‌లో కనిపించడం లేదు. అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నా ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు పొందుపర్చలేకపోతున్నారు. ప్రభుత్వం అవకాశం కల్పిస్తే తప్పా ఆన్‌లైన్ చేసే అవకాశం లేదని రైతులకు నచ్చజెప్పి పంపిస్తున్నారు. జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలో కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన వేలాది మంది రైతులు నిరాశకు గురవుతున్నారు.

రైతుబంధు వివరాలు (గత సీజన్‌కు సంబంధించి)
వానాకాలంలో అర్హులు 1,19,978
కేటాయించిన నిధులు రూ.201.68 కోట్లు (సుమారు)
యాసంగిలో రైతులు 1,22,103
కేటాయించిన నిధులు రూ.201.68 కోట్లు

దరఖాస్తులు తీసుకుంటున్నాం

వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతుబంధు కోసం కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నాం. కానీ డిసెంబర్ వరకు కొత్త పట్టా పాస్‌పుస్తకం పొందిన వారి పేర్లే పోర్టల్‌లో కనిపిస్తున్నాయి. ఆ తరువాత పట్టాలు పొందిన రైతుల పేర్లు రావడం లేదు. లాగిన్‌లో ఉన్న పేర్ల ఆధారంగా ఏఈవోలు వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. ప్రభుత్వం మిగిలిన రైతుల వివరాలను కూడా ఆన్‌లైన్ చేయాలని ఆదేశిస్తే వివరాలు పంపిస్తాం.
– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

భవిష్యత్ తరాల కోసమే

హరితహారం



అధికారులు, ప్రజాప్రతినిధులతో హరితహారం ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- హరితోత్సవంలో మొక్కలు నాటిన అధికారులు
- జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ

ఆసిఫాబాద్: భవిష్యత్తు తరాల కోసమే తెలంగాణకు హరితహారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన హరితోత్సవంలో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్, ఎస్పీ సురేశ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్పతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు మొక్కలు సంరక్షించాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ అటవీశాఖ ద్వారా జిల్లాలోని 20 అటవీ నర్సరీల్లో ఏటా 20 లక్షల మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కోతులు, ఇతర అటవీ జంతువుల పునరావాసం కోసం 422 హెక్టార్లలో పండ్ల మొక్కలు నాటడం, అడవిలో సున్నితమైన ప్రాంతాల్లో పటిష్ట రక్షణకు వాచ్ టవర్ల ఏర్పాటు, అటవీ ప్రాంతాల్లో క్వార్టర్ల నిర్మాణం, బృహత్ పల్లెప్రకృతి వనాల ఏర్పాటు చేయడంతోపాటు తునికాకు సేకరణ కూలీలకు బోనస్ చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్, వెదురు బొంగులతో తయారు చేసిన ఉత్పత్తులు, పరికరాలను ప్రదర్శించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో తెలంగాణ చరిత్ర, అటవీశాఖపై కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, మాజీ ఏఎంసీ చైర్మన్ మల్లేశ్, అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

అర్జీలు వేగంగా పరిష్కరించాలి

ఆసిఫాబాద్: ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలు వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆర్డీవో రాజేశ్వర్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. వారసత్వంగా వచ్చిన పట్టా భూమి పాసుపుస్తకంలో నమోదు కాలేదని, విచారణ చేపట్టి న్యాయం చేయాలని సిర్పూర్(టి) మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి పత్రు కలెక్టర్‌కు విన్నవించాడు. తండ్రి నుంచి తనకు రావాల్సిన వాటాను సోదరులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు యత్నిస్తున్నారని, ఈ ప్రక్రియను నిలిపివేయాలని కౌటాల మండలం గుండాయిపేటకు చెందిన దుర్గం కాసుబాయి అర్జీ సమర్పించింది. మీసేవ కేంద్రం కోసం నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన తనకు ఫ్రాంచైజ్ కేటాయించాలని కాగజ్‌నగర్ పట్టణంలోని ఇందిరా మార్కెట్ ప్రాంతానికి చెందిన షా గుప్తానాజ్ కోరాడు. గృహలక్ష్మి పథకం కింద ఆర్థికసాయం అందించాలని కెరమెరి మండలానికి చెందిన రాథోడ్ కవిత విన్నవించింది. డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని కెరమెరి మండలం కరంజీవాడకు చెందిన రాథోడ్ సావిత్రిబాయి దరఖాస్తు చేసుకుంది. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిని అధికార పార్టీకి చెందిన కొంత మంది నాయకులు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారని, విచారణ చేపట్టి న్యాయం చేయాలని బెజ్జూర్ మండలం లంబాడితండాకు చెందిన బెడకల పాపయ్య ఫిర్యాదు చేశాడు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బోర్కడే

ఇన్నోవేషన్ పోటీలకు జిల్లా విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్/కౌటాల: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు విద్యాశాఖ నిర్వహిస్తున్న స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ తుది దశ పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపికైనట్లు డీఈవో అశోక్, జిల్లా సైన్స్ అధికారి మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కౌటాల మండలంలోని ఇన్‌ఫంట్ జీసస్ పాఠశాలకు చెందిన హర్షిణి, తన్విశ్రీ, సాయి చరణ్య, శ్రీవిద్య రూపొందించిన 'హోం మేడ్ మస్కిటో కాయిల్స్' అనే ప్రాజెక్ట్ పోటీలకు ఎంపికైందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ ట్రెనింగ్ సెంటర్‌లో సోమ, మంగళవారం క్యాంపు కొనసాగుతుందన్నారు. సోమవారం నిర్వహించిన క్యాంపులో విద్యార్థులకు గైడ్ టీచర్‌గా ఝాన్సీ వ్యవహరించినట్లు పేర్కొన్నారు. వీరు ఈ నెల 21న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చరల్ యూనివర్సిటీలోని ఆడిటోరియంలో గ్రాండ్ ఫినాలే నిర్వహిస్తారని వెల్లడించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఇన్‌ఫంట్ జీసస్ స్కూల్ హెచ్ఎం టోమ్, సిబ్బంది అభినందించారు.



పోటీల్లో పాల్గొన్న కౌటాల విద్యార్థులు

'సస్పెండైన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవడం సరికాదు'

ఆసిఫాబాద్‌రూరల్: సస్పెండ్ చేసిన ఉద్యోగులను మళ్లీ విధుల్లోకి తీసుకోవడం సరికాదని, వారిని వెంటనే విధుల నుంచి తొలగించాలని పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం డీఈవో అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయా సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు రవీందర్, తిరుపతి మాట్లాడుతూ ఇటీవల కాగజ్‌నగర్‌లో కేజీబీవీల్లో పని చేసిన ఉద్యోగుల నిర్లక్ష్యంతో పాఠశాల విద్యార్థిని తీవ్ర జ్వరంతో మృతి చెందిందన్నారు. రాజకీయ పలుకుబడి, అధికారుల అండదండలతో ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇచ్చి జిల్లా అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ఏఐఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు సాయి తదితరులు ఉన్నారు.

బడులు ముస్తాబు

- నేడు జిల్లా వ్యాప్తంగా విద్యా దినోత్సవం
- 'మన ఊరు– మన బడి' కింద అభివృద్ధి చేసిన పాఠశాలలు ప్రారంభం
- తల్లిదండ్రులతోపాటు ప్రముఖులకు ఆహ్వానాలు



ప్రారంభానికి సిద్ధంగా వాంకిడి మండలంలోని చిన్నబెండార పాఠశాల

కెరమెరి(ఆసిఫాబాద్): జిల్లాలో మంగళవారం విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. డీఈవో అశోక్ ఇప్పటికే ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో జూమ్ మీటింగ్ నిర్వహించి సంబురాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఉదయం ఏడు గంటల నుంచే కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం 1,263 పాఠశాలలు ఉండగా, సుమారు 92 వేల మంది చదువుకుంటున్నారు. తొమ్మిదేళ్ల కాలంలో పాఠశాలల పురోగతి, అమలు చేస్తున్న పథకాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించనున్నారు.

నేటి కార్యక్రమాలు

- ఉదయం 7:30 నుంచి 8:45 గంటల వరకు ర్యాలీ, విద్యారంగంలో సాధించిన ప్రగతిపై కరపత్రాల పంపిణీ
- 9:35 గంటలకు జ్యోతి ప్రజ్వలన
- 9:40 గంటలకు జాతీయ పతకావిష్కరణ
- 9:45 నుంచి 9:50 గంటల వరకు హెచ్ఎంలు, టీచర్లతో విద్యారంగంలో సాధించిన విజయాలను తెలియజేయడం
- 9:50 –10 గంటలకు ప్రజాప్రతినిధులు, ఎస్ఎంసీ సభ్యుల సందేశాలు
- 10 –10:10 గంటలకు 'మన ఊరు– మన బడి' కింద పనులు పూర్తయిన పాఠశాలల ప్రారంభోత్సవం
- 10:10 –10:20 గంటలకు ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు, ఐఎఫ్‌పీ ప్యానల్స్ ప్రారంభోత్సవం
- 10:20 –10:30 గంటలకు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం. వ్యాస రచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం
- 10:30– 10:45 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రత్యేక ఆహ్వానాలు..

జిల్లాలో అన్ని పాఠశాలల్లో విద్యాదినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. సోమవారం సాయంత్రం వరకు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలలను మామిడి తోరణాలతో అలంకరించారు. మంగళవారం ఉదయం 7 గంటలకే ఉపాధ్యాయులు బడులకు రానున్నారు. ఇప్పటికే విద్యాకమిటీ చైర్మన్‌తోపాటు సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర ప్రముఖులకు ఆహ్వానాలు పంపించారు. ముందుగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సందేశాన్ని తల్లిదండ్రులకు వినిపిస్తారు.

కొత్త బడులు, డిజిటల్ తరగతులు ప్రారంభం..

మన ఊరు మన బడి పథకం కింద జిల్లాలో 251 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇప్పటికే కొన్ని పాఠశాలలు ప్రారంభించగా, నేడు మరో 20 బడులను ప్రారంభించనున్నారు. ఆసిఫాబాద్ మండలంలో 1, జైనూర్ 1, లింగాపూర్ 3, రెబ్బెన 2, సిర్పూర్(యూ) 1, వాంకిడి 2, బెజ్జూర్ 2, చింతలమానెపల్లి 2, కాగజ్‌నగర్ 4, సిర్పూర్(టి) మండలంలో 2 పాఠశాలలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. అలాగే డిజిటల్ ప్యానెల్స్ ఏర్పాటు చేసిన ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ పాఠాలు ప్రారంభించనున్నారు.

నేడు విద్యా దినోత్సవం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం విద్యాదినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డీఈవో అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో నిర్వహించే వేడుకలకు కలెక్టర్ హేమంత్ బోర్కడే, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.


ఎమ్మెల్యేలకు ఆహ్వానం



ఆహ్వానపత్రం అందిస్తున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యాదినోత్సవం కార్యక్రమంలో హాజరు కావాలని ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్పను సోమవారం డీఈవో అశోక్ ఆహ్వానించారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సక్కును కలిశారు. జిల్లాలో మన ఊరు– మన బడి పథకం కింద అభివృద్ధి చేసిన పాఠశాలలను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌వోలు సత్తయ్య, భరత్, ఎంఈవో భిక్షపతి, ఉదయ్‌బాబు తదితరులు ఉన్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



డీఈవో ఆదేశాల మేరకు జిల్లాలో నేడు విద్యాసంబురాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశాం. తొమ్మిదేళ్లలో పాఠశాలలు సాధించిన ప్రగతిని తల్లిదండ్రులకు వివరిస్తాం. ప్రభుత్వ బడుల ప్రాధాన్యతను తెలియజేసి, ప్రవేశాలు పెంచుతాం.
– రాథోడ్ సుభాశ్, ఎస్‌వో– 1

క్లుప్తంగా

జూలైలో కొత్త వేతనాలు

శ్రీరాంపూర్(మంచిర్యాల): బొగ్గుగని కార్మికులకు 11వ వేతన ఒప్పంద ప్రకారం జూలైలో కొత్త వేతనాలు చెల్లించడం జరుగుతుందని ఏఐటీయూసీ వేజ్‌బోర్డు సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేతన ఒప్పందంపై కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సోమవారం సంతకం చేశారని, 21న కోలిండియా నుంచి సర్క్యులర్ రానున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో జూన్ నెల వేతనాలు జూలైలో చెల్లించనున్నట్లు తెలిపారు.

లైమ్‌లైట్ అవార్డుకు ఎంపిక



రాచకొండ నాగేశ్వర్‌రావు

కాగజ్‌నగర్‌టౌన్: సామాజిక సేవాదృక్పథంతో పనిచేసిన ఆర్యవైశ్యులకు ఏటా ఇచ్చే లైమ్‌లైట్ అవార్డుకు కాగజ్‌నగర్‌కు చెందిన రాచకొండ నాగేశ్వర్‌రావు ఎన్నికైనట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే నుంచి ప్రారంభమైన ఆన్‌లైన్ ఓటింగ్ ఆదివారం రాత్రి ముగిసింది. అవార్డు కోసం వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి ఇరుకుల్ల రామకృష్ణ, కాగజ్‌నగర్‌కు చెందిన వాసవి మాత వ్రతకల్ప ప్రచారకర్త రాచకొండ నాగేశ్వరరావు పోటీపడగా 3వేలకు పైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఆయన పేర్కొన్నారు.

తాటి, ఈత వనం దగ్ధం



దగ్ధమైన తాటి, ఈత చెట్లు

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాదలో ప్రమాదవశాత్తు తాటి, ఈత వనం దగ్ధమైంది. వరి కొయ్యకాల్లకు నిప్పు వేయడంతో సమీపంలో ఉన్న తాటి, ఈత చెట్లకు అంటుకుని మంటలు చెలరేగాయి. గమనించిన గ్రామస్తులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.

ఆలయాలకు మహర్దశ



డీడీఎన్ పథకంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయం

ఆసిఫాబాద్‌అర్బన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఆలయాలకు నిత్యం ధూప దీప నైవేద్యాలు జరగాలన్న ఉద్దేశంతో పాటు, అర్చకులకు ఉపాధి కల్పించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007లో ధూప దీప నైవేద్య(డీడీఎన్) పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా నెలకు గౌరవ వేతనం రూ. 2వేలు చెల్లించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ రూ.2వేలు ఉన్న వేతనాన్ని రూ.6 వేలకు పెంచారు.

- ఉమ్మడి జిల్లాకు 184 పోస్టులు మంజూరు
- ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నవారు 484 మంది
- తాజా నిర్ణయంతో 638 కి చేరిన డీడీఎన్ అర్చకులు
- ఇటీవలే రూ.10వేలకు పెరిగిన గౌరవ వేతనం

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	ప్రస్తుతం డీడీఎన్ అర్చకుల సంఖ్య	నూతనంగా మంజూరైన అర్చకుల సంఖ్య	మొత్తం
ఆదిలాబాద్	111	24	135
కుమురంభీం	69	09	78
మంచిర్యాల	142	18	160
నిర్మల్	162	103	265
మొత్తం	484	154	638

నిర్వహణ ఇలా..
దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ధూప దీప నైవేద్యం పథకం కొనసాగుతుంది. ఆలయాల్లో విధులు నిర్వహించే అర్చకులు ప్రతీరోజు ఆలయంలో నిత్యపూజ, నైవేద్యంతో పాటు పండుగలు, ఉత్సవాల సమయాల్లో ప్రత్యేక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాల్సి ఉంటుంది. ప్రభుత్వం ప్రస్తుతం అర్చకులకు నెలకు రూ.6వేలు చెల్లిస్తుండగా అందులో నుంచి నూనె, ప్రసాదం, ఇతర ఖర్చులకు రూ.2వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. సీఎం కేసీఆర్ ఇటీవల మంచిర్యాల పర్యటనలో భాగంగా డీడీఎన్ అర్చకులకు ఇచ్చే వేతనాన్ని రూ.10వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు.

ఉమ్మడి జిల్లాలో 484 మంది అర్చకులు
పథకం ప్రారంభమైన నాటి నుంచి నాలుగు విడతలుగా 484 మంది అర్చకులను నియమించారు. తాజాగా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరో 154 పోస్టులకు నియామక ఉత్తర్వులు జారీ చేయడంతో వీటి సంఖ్య 638కి చేరింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 9, మంచిర్యాలలో 18, ఆదిలాబాద్‌లో 24, నిర్మల్‌లో 103 ఆలయాలకు అర్చకులను నియమించింది. వీరికి ఈనెల 25న ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా ఉత్తర్వులు అందజేయనున్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల్లో అర్చకులకు డీడీఎన్ పథకంలో అవకాశం కల్పించడం హర్షణీయం. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. కానీ జిల్లాలో కేవలం 9 మందికే అవకాశం కల్పించడంతో చాలామంది పేద అర్చకులకు నిరాశే మిగిలింది. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అర్చకులకు అవకాశం కల్పించాలి.
– గంగు సత్యనారాయణశర్మ, డీడీఎన్ సంఘం జిల్లా కార్యదర్శి

నియామకాల్లో పారదర్శకత

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డీడీఎన్ పోస్టుల నియామకాల్లో పారదర్శకత పాటించాం. దరఖాస్తులను పరిశీలించి, ఆలయాలను తనిఖీలు చేసి, అర్హులైన వారిని గుర్తించాం. అర్చకులు సక్రమంగా విధులు నిర్వర్తించాలి. తనిఖీల్లో పట్టుపడితే శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. సమయపాలన పాటించాలి.
– నవీన్‌కుమార్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఉమ్మడి ఆదిలాబాద్

మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

పాతమంచిర్యాల: ఆయుష్మాన్ భారత్ ఇన్సూరెన్స్ కార్డులు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాండూర్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీసీపీ కార్యాలయంలో సోమవారం వివరాలు వెల్లడించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్టు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాయిని బాపు సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో మాదారం, తిర్యాణి, దేవాపూర్, కాసిపేటలలో పలువురు అమాయక గిరిజనులకు ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇస్తామని చెప్పి నకిలీ కార్డులు చూపించి నమ్మించాడు. బయోమెట్రిక్ యంత్రంలో వేలుముద్రలు స్కాన్ చేసి పదిమంది ఖాతాల్లోంచి రూ.2.73 లక్షలు తన ఖాతాలోకి బదిలీ చేసుకున్నాడు. బాధితులు మాదారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా తాండూరు ఐబీలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా సోమవారం పట్టుబడ్డాడు. నిందితుడిని విచారించగా నేరం ఒప్పుకోవడంతో అతనిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితుడి వద్ద నుంచి హీరోహోండా బైక్, బయోమెట్రిక్ మిషన్, రెండు ఫోన్లు, నకిలీ ఆయుష్మాన్ భారత్ కార్డులు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో మాదారం ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

'గుర్తింపు' ఎన్నికలు జరగకుండా కుట్ర

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి, యజమాన్యం కలిసి కుట్ర చేస్తున్నాయని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. సోమవారం ఆర్కే న్యూటెక్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసి రెండేళ్లు కావస్తున్నా ఎన్నికలు నిర్వహించకుండా జాప్యం చేసిందన్నారు. హైకోర్టు ఆదేశంతో ఆర్‌ఎల్‌సీ ఎన్నికల నిర్వహణకు పూనుకున్నారన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు జరిగితే వారి కార్మిక సంఘం ఓడిపోతుందనే భయంతో కోల్‌బెల్ట్ ప్రాంతంలోని కలెక్టర్లతో ఎన్నికలు జరగకుండా సిబ్బంది కొరత ఉందని, శాంతిభద్రతల అంశం అంటూ ఒత్తిడి తెచ్చి లేఖలు రాయిస్తోందన్నారు. జూన్ 24న జరిగే ఎన్నికల సమావేశంలో ఎన్నికల తేదీని ఆర్‌ఎల్సీ ప్రకటించకుంటే అన్ని సంఘాలను కలుపుకుపోయి ఆందోళనకు సిద్ధమవుతామన్నారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ సెక్రటరీ కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి గునిగంటి నరసింహారావు, పిట్ సెక్రటరీ ఆకుల లక్ష్మణ్, నాయకులు భీంరాజు, గజ్జి రమేశ్, సంపత్, అక్రంపాషా, అఫ్రోజ్‌ఖాన్, మల్లేశ్, మురళిచౌదరి, తిరుపతి, రవీందర్ పాల్గొన్నారు.

'సింగరేణిలో ఎన్నికలు వెంటనే నిర్వహించాలి'



మాట్లాడుతున్న కే.లక్ష్మారెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని బీఎంఎస్ కోల్ సెక్టార్ ఇన్‌చార్జి, వేజ్‌బోర్డు సభ్యుడు కే.లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. అధికార వర్గానికి సింగరేణిలో ప్రతికూల పరిస్థితులు ఉండటంతో ఎన్నికలు నిర్వహించకుండా అడ్డుకుంటున్నారన్నారు. ఎన్నికల నిర్వహణకు సిబ్బందిని కేటాయించడం వీలుకాదంటూ కొత్తగూడెం కలెక్టర్ రిటర్నింగ్ అధికారికి లేఖ రాసినట్లు తెలిసిందని, ఇది ప్రజాస్వామ్య పద్ధతికి విరుద్ధమన్నారు. సమావేశంలో ఏబీకేఎంఎస్ కమిటీ సభ్యులు మంద రమాకాంత్, పులి రాజిరెడ్డి, బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి రంగా పవన్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, సెంట్రల్ కార్యదర్శులు కాసెట్టి నాగేశ్వరరావు, కాదాసి భీమయ్య, ఏరియా సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, నాయకులు వినోద్‌కుమార్, రమేశ్, పంచర్ల నరేశ్, చంద్రశేఖర్, గోపతి సందీప్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చుతున్న జేసీబీ

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ బస్టాండ్ ఏరియాలోని ఎన్‌హెచ్ 63 పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలను సోమవారం మున్సిపల్ అధికారులు కూల్చివేయించారు. ఎన్‌హెచ్ అధికారుల ఆదేశాలతో నస్పూర్ మున్సిపల్ కమిషనర్ టీ.రమేశ్, సిబ్బందితో కలిసి జేసీబీలతో నిర్మాణాలను నేలమట్టం చేయించారు. మంచిర్యాల నుంచి శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణ పనులు ఆర్నెల్లుగా నడుస్తుండటంతో ఇప్పటికే కొందరు రోడ్డుకు దగ్గరగా ఉన్న నిర్మాణాలను కూల్చివేసి వెనక్కి కట్టుకున్నారు. కొంతమంది నిర్ణీత దూరం జరగకుండానే కొత్త నిర్మాణాలు చేపట్టారు. వీటిని తొలగించాలని మూడు రోజుల నుంచి మున్సిపల్, ఎన్‌హెచ్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో పోలీసు బందోబస్తు నడుమ జేసీబీలతో కూల్చివేశారు. రోడ్డు మధ్యభాగం నుంచి 66 ఫీట్ల వరకు రోడ్డు మార్కింగ్ చేసి ఆ పరిధిలో ఉన్న నిర్మాణాలను కూల్చివేశారు.

వర్తకుల అభ్యంతరం..
గతంలో రోడ్డు మధ్యలో నుంచి 60 ఫీట్లు మార్కింగ్ చేశారని, ఇప్పుడు 66 ఫీట్లు జరగాలని చెప్పి కొత్తగా కట్టుకున్నవి కూడా కూల్చివేస్తున్నారని కొందరు వర్తకులు అభ్యంతరం తెలిపారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు నిర్వహించారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- డీడీ దిలీప్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: అర్జీలు సత్వరం పరిష్కరించాలని డీడీ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. అంతకు ముందు దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన హరితదినోత్సవం పురస్కరించుకొని ఐటీడీఏ ఆవరణలో అధికారులు సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఓఎస్డీ కృష్ణయ్య, జే డీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- దంతన్‌పల్లి పీహెచ్‌సీలో అటెండర్ ఉద్యోగం ఇప్పించాలని ఇంద్రవెల్లి మండలానికి చెందిన కుమ్ర సత్యవతి అర్జీ సమర్పించింది.
- ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి (చెరువుగూడ) గ్రామానికి వసతి గృహం మంజూరు చేయించాలని సోయం జంగు కోరాడు.
- డిగ్రీ కళాశాలలో స్వీపర్‌గా ఉద్యోగం ఇప్పించాలని ఆసిఫాబాద్ మండలం కేస్లాపూర గ్రామానికి చెందిన టేకం కవిత విన్నవించింది.

ఆగని గుప్తనిధుల తవ్వకాలు!



గుప్త నిధుల కోసం తవ్విన గొయ్యి

వేమనపల్లి(బెల్లంపల్లి): రాజారాం రేణుక ఎల్లమ్మ దేవస్థానం వద్ద గ్రామస్తులు జాతర ఏర్పాట్లకు సిద్ధం చేస్తుండగా అక్కడ జరిగిన తవ్వకాలు కలకలం రేపుతున్నాయి. ఆంజనేయస్వామి విగ్రహం పక్కనే నాలుగు రోజుల క్రితం గుప్త నిధుల కోసమే తవ్వకాలు జరిపినట్లు ఆనవాళ్లు తెలుపుతున్నాయి. గత ఏప్రిల్ 11న ఇక్కడ గుడి నిర్మాణం పేరుతో గోతులు తవ్వారు. ఎలాంటి గుడి నిర్మించకపోవడంతో గుప్త నిధుల కోసమే గోతులు తవ్వారని గ్రామస్తులు కొందరు అనుమానిత వ్యక్తులను నిలదీశారు. రెండు నెలల తర్వాత మళ్లీ తవ్వకాలు జరపడం సంచలనంగా మారింది. రెండు రోజుల క్రితం గ్రామస్తులు నీల్వాయి పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై సుబ్బారావు దేవాలయం వద్దకు వెళ్లి ఇరువర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఒక వర్గానికి చెందిన వారు మరో వర్గం వారిని ఇరికించేందుకు తాజాగా ఈ గోతులు తవ్వినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గ్రామస్తులు ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామన్నారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య

కాగజ్‌నగర్‌టౌన్: భర్త వేధింపులు తాళలేక పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో చోటు చేసుకున్నట్లు సీఐ బుద్దే స్వామి తెలిపారు. కాలనీకి చెందిన బి.హర్షిత (26) తన భర్త అరుణ్ వేధింపులు తాళలేక ఆదివారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి వెంకటేశం ఫిర్యాదు మేరకు అరుణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

గైర్హాజర్ కార్మికులకు కౌన్సెలింగ్

రెబ్బెన(ఆసిఫాబాద్): గైర్హాజరుతో ఉద్యోగం కోల్పోయి కుటుంబాన్ని రోడ్డుపాలు చేయవద్దని ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం ఉమాకాంత్ అన్నారు. సోమవారం గోలేటిలోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్‌హాల్‌లో గైర్హాజరైన కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో డీవైసీఎంవో ఆర్ శౌరీ, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహరా, జీఎం కార్యాలయ పిట్ కార్యదర్శి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో కూలీ మృతి

ఆసిఫాబాద్‌రూరల్: అనుమానాస్పదంగా భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సిర్పూర్(టీ) మండలంలోని వెంపల్లి గ్రామానికి చెందిన గుర్లె భీంరావు (30) మండలంలోని జెండాగూడ సమీపంలో నిర్మిస్తున్న బీజేపీ కార్యాలయ భవన నిర్మాణ పనులకు గ్రామస్తులతో కలిసి రోజు కూలీ పనులకు వెళ్తున్నాడు. ఆదివారం కూడా పనికి వచ్చిన భీంరావు ఇంటికి వెళ్లలేదు. సోమవారం ఉదయం పనికి వచ్చిన కూలీలు భీంరావు భవనం కిందపడి చనిపోయి ఉండడాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అప్పటికే భవన గుత్తేదారు, పోలీసు సిబ్బంది మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. దీంతో తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎందుకు తరలించారని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. విచారణ జరిపి యజమానిపై కేసు నమోదు చేస్తామని ఎస్సై గంగన్న తెలపడంతో ధర్నా విరమించారు. మృతుని భార్య శారద గర్భిణి. పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఏఐసీసీ ఆదివాసీ జాతీయ ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్



అభివాదం చేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు ఏఐసీసీ ఆదివాసీ జాతీయ ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక తిరుమల ఫంక్షన్ హాల్‌లో టీపీసీసీ గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్ చౌహాన్ అధ్యక్షతన సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎస్టీ సెల్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బెల్లయ్య నాయక్ హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిని కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ అధికారంలోకి వస్తే సిలిండర్ రూ.500, బస్సులో ఉచిత ప్రయాణం, రూ.2 లక్షల రుణ మాఫీ, 2 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తుందని అవగాహన కల్పించాలన్నారు. ప్రజల్లో తిరిగే నాయకులకు గుర్తింపు ఉంటుందని, టికెట్ నిర్ణయించేది అధిష్టానమే అని తెలిపారు. జిల్లాలో ఉన్న పది సీట్లు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని తెలిపారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు గోమాసే శ్రీనివాస్, వెడ్మ బొజ్జు, డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, నరేశ్‌జాదవ్, విశ్వప్రసాద్, మర్సుకోల సరస్వతి, సెడ్మకి ఆనంద్‌రావు, మండల అధ్యక్షుడు రాజేశ్వర్, ప్రభాకర్, పుర్కబాపురావు పాల్గొన్నారు.

కల్తీ మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాటిళ్లు

దహెగాం/కాగజ్‌నగర్‌టౌన్: దహెగాం మండల కేంద్రంలోని శ్రీ చక్ర మద్యం దుకాణంలో హైదరాబాద్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సీఐ లతీఫ్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన తనిఖీల్లో నకిలీ మద్యం పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ విలాస్ తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు దుకాణంలో తనిఖీ చేయగా కల్తీ చేసిన 14 ఆఫీసర్ చాయిస్ ఆఫ్ బాటిళ్లు లభించాయన్నారు. మద్యం సీసాల్లో నీళ్లు కలిపి అమ్ముతున్నారన్నారు. బాటిళ్లను స్వాధీనం చేసుకుని షాప్‌లో పనిచేస్తున్న ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన నియామకం

బెల్లంపల్లి: ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ)రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా జిల్లాకు చెందిన కొయ్యల ఏమాజీ, జాడి తిరుపతిని ఎన్నుకున్నారు. ఈనెల 17, 18 తేదీల్లో సంఘం రాష్ట్ర మహాసభలు భువనగిరిలో జరిగాయి. ఈ సందర్భంగా ఎన్నుకున్న రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు చోటు కల్పించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

చెన్నూర్‌రూరల్: తమ భూమిని తమకు దక్కకుండా చేస్తున్నారని మండలంలోని కొమ్మెర గ్రామానికి చెందిన కమ్మగోని దుర్గ సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... గ్రామంలోని 47 సర్వే నంబరులో ఉన్న అయిదెకరాల భూమి తమకు వారసత్వంగా వచ్చిందని, తన భర్త శ్రీనివాస్ పేరు మీద పట్టాపాసు పుస్తకాలు ఉన్నాయని తెలిపింది. గతేడాది నుంచి కొందరు తమ భూమిని తమకు దక్కకుండా చేస్తున్నారని, ఎంపీపీ, స్థానిక సర్పంచ్ కుమారుడు భూమి విషయంలో జోక్యం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై ఎంపీపీని వివరణ కోరగా వారి భూమి విషయంలో తాను జోక్యం చేసుకోలేదని, తనపై అకారణంగా దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 22న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ.వెంకట రమణ తెలిపారు. ఉజ్వల త్రిఫ్ట్ కో ఆపరేటివ్ సొసైటీలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ పోస్టులకు ఇంటర్, డిగ్రీ పాసైన 35 సంవత్సరాల లోపు వయస్సు గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు మంచిర్యాల, హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో పని చేయాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు 9111731173, 6304600392 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆరుగురికి మూడేళ్ల జైలు

జైపూర్: మండలంలోని కుందారం గ్రామానికి చెందిన పోటు తిరుపతికి సింగరేణి ఉద్యోగం ఇప్పిస్తామని మోసగించిన కేసులో ఆరుగురికి సోమవారం కోర్టు మూడేళ్ల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. 2016లో ఎడ్ల రాజిరెడ్డి, ఉండేటి ప్రతాప్‌కుమార్, వెంకటనిర్మల్ కుమార్, కొత్త వెంకటయ్య, హర్షవర్దన్‌రావు, ఒజ్జ కొమురయ్యలపై కేసు నమోదైంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రేమలత చెన్నూర్ సివిల్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో నిందితులకు జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ జడ్జి సంపత్‌కుమార్ తీర్పునిచ్చినట్లు ఎస్సై తెలిపారు.

'ఓరియంట్'లో హరితోత్సవం



మొక్క నాటుతున్న అధికారులు

కాసిపేట(బెల్లంపల్లి): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపనీ ఆవరణలో హరితోత్సవం నిర్వహించారు. యూనిట్ హెడ్ ఎంపీ జోషి, ఫారెస్టు రేంజ్ అధికారి అనిత ముఖ్యఅతిథులుగా హాజరై మొక్కలు నాటారు. ఓరియంట్ మైన్స్ హెడ్ ఎస్‌పీ సహరే, యూనిట్ హెడ్ మహేంద్రప్రతాప్ జోషి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీరాంపూర్: కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ కృషి చేస్తోందని ఆ యూనియన్ కోల్ సెక్టార్ ఇన్‌చార్జి కే.లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం యూనియన్ ముఖ్యనేతలతో ఎల్–20 సదస్సు నిర్వహణపై చర్చించారు. సమావేశంలో మంద రమాకాంత్, పులి రాజారెడ్డి, యాదగిరి సత్తయ్య, పేరం రమేశ్, నాగేశ్వరరావు, నాతాడి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.